

సిసి రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అయినవిల్లి

అయినవిల్లి మండలంలోని సిరిపల్లి గ్రామ పరిధిలోని చిల్లేవారిపేటలో ఎంపీ నిధుల నుంచి రూ.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులను ఆదివారం గ్రామ సర్పంచ్ కుడుపూడి శాంత వతి, ఎంపిటిసి సభ్యులు యాడ్ల కిరణ్ కుమార్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు కుడిపూడి విద్యాసాగర్, గ్రామ ఉప సర్పంచ్ కొంచెం నాని, వార్డు సభ్యులు ఆకుల శ్రీనివాస్, చిల్లి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



చిల్లేవారిపేటలో రోడ్డు పనులు ప్రారంభిస్తున్నసర్పంచ్

పునాదుల్లోనే పాఠశాల భవనాలు

- ముందుకు సాగని నాడు-నేడు పనులు
- 46 పాఠశాలలు రూ.12 కోట్లతో అభివృద్ధి
- సౌకర్యాల లేమితో విద్యార్థుల అవస్థలు

ప్రజాశక్తి-మండపేట

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధే లక్ష్యంగా చేపట్టిన రెండవ విడత నాడు-నేడు పనులు ముందుకు సాగడంలేదు. మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 68 పాఠశాలలు ఉండగా మొదటి విడతలో 24 పాఠశాలలను ప్రభుత్వం ఇప్పటికే అభివృద్ధి చేసింది. రెండవ విడతలో మరో 46 పాఠశాలను సుమారు రూ.12 కోట్లతో అభివృద్ధి చేసేందుకు అధికారులు పనులు ప్రారంభించారు. ఈ పాఠశాలలలో ప్రధానంగా మేజర్, మైనర్ రిపేర్లతో పాటు డ్రింకింగ్ వాటర్, టాయిలెట్స్, గ్రీన్ చార్ట్ బోర్డు, ఫర్నిచర్, విద్యుత్ మరమ్మతులతో పాటు అదనపు తరగతి గదులు నిర్మాణం చేపడుతున్నారు.

రూ.8 కోట్లతో అదనపు తరగతుల నిర్మాణం

శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాలల భవనాలు, పాఠశాలల విలీనం నేపథ్యంలో పెరిగిన విద్యార్థుల సంఖ్య, తదితర సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని మనబడి నాడు నేడులో భాగంగా సుమారు రూ.8 కోట్ల అంచనాలతో 13 పాఠశాలల్లో ప్రభుత్వం చేపట్టిన అదనపు తరగతి గదుల భవనాల నిర్మాణ పనులు ముందుకు సాగడంలేదు. పట్టణంలో జిల్లా పరిషత్ బాలకోన్నత, గొల్లపుంత, సత్యశ్రీ సెంటర్‌లోని సర్దార్ వేగుళ్ల వీర్రాజు, గౌతమి మున్సిపల్ పాఠశాలలు కాగా మండలంలోని ద్వారపూడిలో జిల్లా పరిషత్ బాలిక, బాలుర ఉన్నత పాఠశాలలతోపాటు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, వెలగతోడు, తాపేశ్వరం, కేశవరం, ఉన్నత పాఠశాలలు, ఏడిద, చిన్నద్వారపూడి, మెర్నిపాడులలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో మొత్తంగాను 62 తరగతి గదుల భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

ఒక్కోక్క తరగతి గది నిర్మాణానికి ప్రభుత్వం రూ.12 లక్షల నిధులు కేటాయించింది. ఇది ఇలా ఉండగా ఇప్పటి వరకు ప్రభుత్వం రూ.1.23 కోట్ల విడుదల చేయగా ఆమేరకు నిర్మాణ పనుల కోసం ఖర్చు చేశారు. మిగిలిన నిధులు విడుదల కాకపోవడం తదితర కారణాల నేపథ్యంలో గత కొద్ది రోజుల నుంచి పనులు ముందుకు సాగడంలేదు. దీంతో భవనాలు ఎప్పటికి పూర్తవుతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. భవనాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇది ఇలా ఉండగా కేశవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 563 మంది విద్యార్థులు ఉండగా అందులో బాలికలు 269, బాలురు 294 ఉన్నారు. వీరికి తరగతి గదులు సరిపోకపోవడంతో నాడు-నేడులో 7 గదులు, సమగ్ర శిక్ష నిధులు రూ.66 లక్షలతో 2019 ఏడాదిలో 6 అదనపు తరగతి గదులు పనులు పూర్తి కాలేదు. ఈనేపథ్యంలో గదులు సరిపోకపోవడంతో పూర్తి కాని రెండు గదులలో తరగతుల నిర్వహిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా డైనింగ్ హాలు, తదితర సౌకర్యాల కల్పనతో పాటు పాఠశాల ఆవరణలో ఆస్తులు ధ్వంసం అవుతుండటంతో పాటు పాఠశాల ఆవరణ అక్రమణలకు గురవుతుందని వాటి పరిరక్షణకు వాచ్‌మెన్‌ను నియమించడంతోపాటు పాఠశాల చుట్టు రక్షణ గోడను నిర్మించాలని వారు కోరుచున్నారు.



కేశవరంలో పునాదుల్లో ఉన్న పాఠశాల భవనం



నిర్మాణం పూర్తికాని తరగతి గదిలో విద్యార్థులు

నిధులు విడుదల కావాల్సిఉంది



శిథిల భవనాలు, పాఠశాలల విలీనం నేపథ్యంలో పెరిగిన విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని మనబడి నాడు నేడులో భాగంగా అదనపు తరగతి గదుల భవనాల నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టింది. అయితే నిధులు విడుదల కాని నేపథ్యంలో పనులు జరగడంలేదు. నిధులు రాగానే తిరిగి పనులు ప్రారంభిస్తాము.

-నాయుడు రామచంద్రరావు, ఎంఇఒ



కేశవరం పాఠశాల వరండాలో ఉంచిన ఐరన్

త్వరితగతిన వసతులు కల్పించాలి



నిధులు విడుదల కాని కారణంగా అదనపు తరగతుల భవనాల నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. దీంతో భవనాల నిర్మాణానికి వినియోగించే సామగ్రి తుప్పుపట్టి పోతోంది. విద్యార్థుల సౌకర్యార్థం త్వరితగతిన వసతులు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టి పనులు పూర్తిచేయాలి.

- కె.కృష్ణవేణి, సిఐటియు జిల్లా కార్యదర్శి



అమలాపురంలో ఏర్పాటుచేసిన దీక్షా శిబిరంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

సిపిఎస్‌ను రద్దు చేయాలి

- కలెక్టరేట్ ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యంలో సంకల్పదీక్ష
- ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించిన పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐవి

ప్రజాశక్తి-అమలాపురం

ప్రస్తుత సిపిఎస్ రద్దు చేసి వెంటనే పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్ఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆదివారం జిల్లా యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సంకల్ప దీక్ష చేపట్టారు. ఈ సంకల్ప దీక్షా శిబిరంలో సుమారు 300 మంది ఉపాధ్యాయులు పాల్గొనిరాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్ఎల్‌సి ఐవి మాట్లాడుతూ మడమ తిప్పను మాట తప్పను చెప్పాడంటే చేస్తాడంటే వంటివి ప్రకటనలకి పరిమితం అయ్యాయని సిఎం జగన్‌ను ఎద్దేవా చేశారు. నాడు ప్రతిపక్షంలో ఉన్న జగన్ పాదయాత్ర చేసి నేడు అధికారంలోకి వచ్చాక నిరసనలు దీక్షలు ధర్నాలు చేయడానికి వీలు లేదంటూ జిఒ నెంబర్ 1 తెచ్చారని అన్నారు. సిఎం అయిన వారం రోజుల్లోనే సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగిస్తానని సిఎం జగన్ హామీ ఇచ్చి మాట తప్పారని అన్నారు. సిపిఎస్ బదులు జిపిఎస్ అనే కొత్త పెన్షన్ విధానం వల్ల ప్రభుత్వానికి ఉద్యోగులకు ఉపాధ్యాయులకు ఎవరికి ఎటువంటి ప్రయోజనం లేదని అన్నారు. కార్పొరేటర్ కి మాత్రమే లాభాన్ని చేకూర్చే సిపిఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఈ సందర్భంగా ఐవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే సిపిఎస్ రద్దు చేయకపోతే రానున్న రోజుల్లోఉపాధ్యాయులు ఉద్యమానికి దిగుతామని ఎమ్ఎల్‌సి ఐవి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వచ్చే ఏడాది ఎన్నికల్లో జగన్ ప్రభుత్వం సిపిఎస్ రద్దు మాట నిలబెట్టుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకుంటుందని అన్నారు. ఈ సందర్భంగా ఐ వి ఆటపాటలతో ఉద్యమ గీతాలతో ఉపాధ్యాయులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ నాయకులు డి.వి. రాఘవులు, ఎస్.జ్యోతి బసు, సురేంద్ర కుమార్, కేశవరావు, ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్, కాశీ విశ్వేశ్వరరావు, బాలాజీ, బి.శ్రీనివాసరావు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్ఎల్‌సి ఐవి



భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

అన్నదాన శిబిరం వార్షికోత్సవం

ప్రజాశక్తి - అంబాజీపేట


స్వామి వివేకానంద యోగా ఫిజియోథెరపి ఆస్పత్రి, ప్రజల సహకారంతో జరుగుతున్న అన్నదానశిబిరం ప్రథమ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా డొక్కా సీతమ్మ అన్నదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. అంబాజీపేట, అమలాపురం మండలాల పరిధిలో రోడ్డు పక్కన నివాసముంటున్న 200 మందికి యోగా శ్రీనివాస్ సభ్యులతో కలిసి ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పితాని వీరా స్వామి, కుడి పూడి నాగేశ్వర రావు, యోగా సభ్యులు పాల్గొన్నారు.

'చట్టాలను అపహాస్యం చేస్తున్న ప్రభుత్వాలు'

ప్రజాశక్తి-అయినవిల్లి

రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలు చట్టాలను అపహాస్యం చేసే విధంగా వ్యవహరించటం నేరమని పి.గన్నవరం టిడిపి లీగల్ సెల్ అధ్యక్షుడు బడుగు భాస్కర్ జోగేష్ అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో చట్టం తన పని తాను చేసే పరిస్థితి లేదన్నారు. అధికారులు స్వతంత్రంగా వ్యవహరించలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. జోగేష్‌ను పార్టీ తరపున ఘనంగా సన్మానించారు.

కార్టూ'నిజం'



వేర్వేరు చోట్ల ఉచిత వైద్యపరీక్షలు



మండపేట్ల 28వార్డులో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం

ప్రజాశక్తి-యంత్రాంగం


జిల్లాలో వేర్వేరు చోట్ల ఆదివారం ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వివరాలు ఇవి..

మండపేట స్థానిక 28వ వార్డులోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న సాయి ఆర్థో ట్రామాకేర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ ప్రతివాడ నూక దుర్గారాణి ప్రారంభించారు. ఈ శిబిరంలో ఎముకులు, కీళ్ల వ్యాధి నిపుణులు డాక్టర్ కె.రాము, స్త్రీ ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్.అస్మా అక్తర్, గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ బి.పవన్, బిపి షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ కె.నాగ సతీష్ కుమార్ లు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మొండి భవాని మురళి, బిజెపి నాయకులు కోన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలు అభినందనీయం

1980- 85 పూర్వ విద్యార్థుల సహకారంతో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించడం అభినందనీయమని ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అన్నారు. గ్రామంలో జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో ఏర్పాటుచేసిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో ఈ మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఏడిదతోపాటు పాటు ఇతర ఆసుపత్రుల చెందిన 23 మంది వైద్య నిపుణులు వైద్య సేవలు అందించారు. ఆపరేషన్ అవసరమైన వారికి ఆరోగ్య శ్రీ పథకంలో ఆపరేషన్లు చేయిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. వైద్య శిబిరంలో 1000 నుంచి 1200 మంది ప్రజలు వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, ప్రజా ప్రతినిధులతో పాటు పూర్వ విద్యార్థులు ఆర్.జానకి రామయ్య, ఎం.రామకష్ణ, జి.సుబ్బారావు, లావణ్య, సుజాత, పద్మ, రమ, రాఘవ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం చల్లపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో ఆదివారం అమలాపురం సాయి సంజీవిని ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని సర్పంచ్ ఇసుకపట్ల జయమణి ప్రారంభించారు. శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన వైద్యులు చిలువూరి పవన్ కుమార్,రుద్రరాజు సాయి శిల్పి, యాళ్ల సతీష్, వంశీకష్ణలు సుమారు 400 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యరగర్త వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలు ఇసుకపట్ల రఘుబాబు, దంగేటి బాబులు, పోలిశెట్టి శివాజి, నిమ్మకాయల చెల్లయ్య నాయుడు, నూకల సుబ్బారావు, దంగేటి శ్రీహరి, కుసుమే వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



చల్లపల్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



ఏడిదలో పూర్వ విద్యార్థుల సహకారంతో మెగా వైద్య శిబిరం

పురస్కార గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి-ఆలమూరు

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్న గుమ్మిలేరు సర్పంచి గుణ్ణం రాంబాబును కొత్తపేట కాకతీయ కమ్మ మహాజనసంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమ్మ సంఘం అధ్యక్షుడు దొడ్డపనేని త్రినాథరావు, ఆలమూరు మాజీ ఎఎంసి ఛైర్మన్ ఈదల నల్లబాబు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.



గంధోత్సవం నిర్వహిస్తున్నదృశ్యం

వైభవంగా గంధోత్సవం

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణంలోని జెండా వీధిలో గల హజరత్ మౌలాలీ ముష్కల్ కుషా దర్గా వద్ద ఆదివారం 37వ గంధోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్య్రక్రమంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ అధ్యక్షతన పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమం లో రామచంద్రపురం పట్టణం పరిసర గ్రామాల నుంచి, జిల్లా నలుమూలల నుంచి యాత్రికులు విచ్చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిగింది.

వెయిట్ లిఫ్టింగ్‌లో 'కోనసీమ' క్రీడాకారుల సత్తా

ప్రజాశక్తి-అమలాపురం

ఇటీవల ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేటలో జరిగిన అండర్119 స్కూల్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన పలువురు విద్యార్థులు సత్తా చాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. పి.వందన 81 కేజీ ల విభాగంలో సిల్వర్ మెడల్, బి.యశ్వంత్ 66 కేజీ ల విభాగంలో గోల్డ్ మెడల్, డి.వేణు సాగర్ 102 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్‌ను సాధించారు. శ్రీకాకుళం జిల్లా రాజాంలో జరిగిన జె ఎన్ టి యు యూనివర్శిటీ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఎం.వీరేంద్ర 89 కేజీ ల విభాగంలో గోల్డ్ మెడలను సాధించి ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. నలుగురు లిఫ్టర్లకు ఆదివారం అమలాపురంలో వంటెద్దు వెంకన్న నాయుడు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు యెనుముల కష్ణ పద్మరాజు మాట్లాడుతూ కోచింగ్ సదుపాయములను, పోటీల నిర్వహణ కార్యక్రమంలోను, క్రీడాకారులు కావలసిన వసతులను అసోసియేషన్ నుంచి సహకారాలు ఉంటాయన్నారు. వంటెద్దు వెంకన్న నాయుడు మాట్లాడుతూ క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో కూడా గెలుపొందే విధంగా శిక్షణను పొందాలన్నారు. కార్యక్రమంలో దొమ్మేటి వెంకటరమణ, నగబేరి కష్ణమూర్తి, ముంగర ప్రసాదు, చీకురుమిల్లి కిరణ్ కుమార్, మట్టపర్తి సముద్రం, చిక్కం, రాజబాబు,అప్పన్న క్రీడాకారుల తల్లిదండ్రులు కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు సన్మానం చేస్తున్న దృశ్యం



పరామర్శిస్తున్న సర్పంచ్ శ్యామ్ కుమార్

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

వన్నె చింతలపూడి గ్రామానికి చెందిన చుట్టుగుళ్ళ ప్రసాద్ కుటుంబ సభ్యులను ఆదివారం రాష్ట్ర తెలుగు యువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి, సమనస గ్రామ సర్పంచ్ పరమట శ్యామ్ కుమార్ పరామర్శించారు. ప్రసాద్ ఇటీవలే అనారోగ్యంతో మతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి వారి కుటుంబసభ్యులకు సర్పంచ్ ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. కార్యక్రమంలో పరమట భీమమహేష్, బల్ల సురేష్ కుమార్, చుట్టాగుళ్ల సత్యనారాయణ, సుబ్బారావు, కుటుంబరావు, రమేష్, మధుబాబు, లంక విజయ్, పరమట వెంకటేష్, శెట్టిబత్తుల భాను తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి

ప్రజాశక్తి-అమలాపురం

సేవా కార్యక్రమాలతోనే నిజమైన సంతృప్తి లభిస్తుందని పలువురు ప్రముఖులు అన్నారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ 316బి రీజియన్ 2 ప్రాంతీయ సమ్మేళనం రీజియన్ ఛైర్ పర్సన్ రీజియన్ లయన్ మాకిరెడ్డి విఎన్ఎస్.పూర్ణిమ అధ్యక్షతన ఆదివారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా బోడసకుర్రు బిఆర్‌కె.ఫంక్షన్ హాల్ నందు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లయన్ శేర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు. నోట్ స్పీకర్‌గా కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కాల్లకూరి శైలజ పాల్గొని సేవ, విశిష్టత గురించి ప్రసంగించారు. కార్యక్రమంలో వివిధ రంగాల్లో సేవలు అందజేసిన 10 లయన్స్ క్లబ్బు లకు చెందిన అధ్యక్షులకు, సభ్యులకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో మాకిరెడ్డి ఆదినారాయణరావు, ఇవివి.ఈశ్వర్ కుమార్, డాక్టర్ పిఎస్.శర్మ, జంపన సుమన్‌వర్మ, పిఎస్.కామేశ్వరీదేవి, సిహెచ్.మధుశ్రీ, కె.ఉమాదేవి, పి.నంతలక్ష్మీ దేవి అడ్వకేట్స్,లయన్స్ పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖులు

'ఎస్‌విబిసి' సలహాదారునిగా దుర్గారావు

ప్రజాశక్తి -కాట్రేనికొన

టిటిడి ఆధ్వర్యంలోని వెంకటేశ్వర భక్తి ఛానల్(ఎస్‌విబిసి) సలహాదారునిగా సీనియర్ పాత్రికేయులు అడపా నాగదుర్గారావు నియమితులయ్యారు. ఇటీవల ఎస్‌విబిసి బోర్డు తీసుకొన్న నిర్ణయం మేరకు సిఇఒ షణ్ముఖ కుమార్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాది కాలం ఈ పదవిలో ఆయన కొన సాగుతారు. కాట్రేనికోనకు చెందిన దుర్గ రెండున్నర దశాబ్దాలుకు పైగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో వివిధ హోదాల్లో పనిచేశారు ఎస్‌విబిసి ఆదివారం దుర్గ మాట్లాడుతూ అడ్వైజర్‌గా తనను నియమించిన సందర్భంగా సిఎం జగన్, టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, టిటిడి ఇఒ ధర్మారెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇఎన్‌సికి సమస్యల వినతి

ప్రజాశక్తి-మామిడికుదురు

ఎపి ఇరిగేషన్ ఇంజినీరింగ్ ఇన్ ఛీఫ్ (ఇఎన్‌సి) ఎల్. నారాయణరెడ్డిని పి.గన్నవరం ఎమ్ఎల్ఎ కొండేటి చిట్టిబాబు కలిసి పలు సమస్యలను విన్నవించారు. ఎపి ఇరిగేషన్ ఇఎన్‌సిని ఎమ్ఎల్ఎ ఆదివారం దిండి రిసార్ట్స్‌లో మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సత్కరించారు. ఎమ్ఎల్ఎ మాట్లాడుతూ పి.గన్నవరం నియోజకవర్గంలో ఎక్కువ నదీతీర గ్రామాలు ఉండటంతో నదీ కోత తీవ్రంగా ఉండి నివాస గహాలు నదిలో కలసిపోయే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఆదుర్రు వాడ బోదె డ్రైన్‌లపై బ్రిటీష్ హయాంలో నిర్మించిన స్లూయిజ్‌లు శిథిలస్థితికి చేరుకుని ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. ఉడిమూడి, ఉచ్చులవారిపేట సమీపంలో ప్రధాన పంట కాలువ బ్రిడ్జి నిర్మాణం తదితర సమస్యలు ఆయన దష్టికి తీసుకువెళ్లారు. బి.దొడ్డవరం, వాకలగరువు ప్రాంతాల గ్రోయిన్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని ఎపి ఇరిగేషన్ ఇఎన్‌సిని కోరారు.



నారాయణ రెడ్డిని సత్కరిస్తున్న ఎమ్ఎల్ఎ

కారు ట్యాంక్ పేలి ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-గండేపల్లి

మండల కేంద్రమైన గండేపల్లిలోని బ్రహ్మంగారి గుడి సమీపంలో కారును పాత ఇనుప సామాన్లకు గ్యాస్ కట్టర్‌తో కట్ చేస్తుండగా ట్యాంక్‌లో కొద్దిపాటి డీజిల్ ఉండటంవల్ల ఒక్కసారిగా పేలింది. ఆదివారం జరిగిన ఈ ప్రమాదంలో గండేపల్లి గ్రామానికి చెందిన ముగ్గురికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన నల్లే శివ, దాసరి స్వామి, షేక్ బాషా గాయపడ్డారు. కాలం చెల్లిన కారును బ్రహ్మంగారి గుడి సమీపంలో గ్యాస్ కట్టర్‌తో విడదీస్తుండగా ఈ ప్రమాదం సంభవించినట్లు తెలిపారు. గాయపడిన వారిని సమీప ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



సభలో మాట్లాడుతున్న శ్రీనివాస్

12వ పిఆర్‌సి అమలుకు డిమాండ్

ప్రజాశక్తి-కాకినాడ

రాష్ట్రంలో ఉన్న 13 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్, కార్మికులకు 12వ వేతన సవరణ అమలు చేయాలని ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు లంకలపల్లి సాయి శ్రీనివాస్, కార్యదర్శి హెచ్.తిమ్మన్న డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎస్‌టియు భవన్‌లో జిల్లా అధ్యక్షుడు కె.కాశీ విశ్వనాథ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ బకాయిలు, కరువుభత్యం, భవిష్యనిధి, జీవిత బీమా చెల్లింపు బకాయిలు, సంపాదిత సెలవు, మెడికల్ బిల్లులు చెల్లింపులు తక్షణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన విధంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాన్ని రద్దు చేసి 2004 నుంచి పాత పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేసారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు దొరబాబు, వెంకటరావు, నాయుడు, కెవి.శేఖర్, పాల్గొన్నారు.

విశ్వనాథ్ మృతికి సంతాపం

ప్రజాశక్తి-సామర్లకోట

సినిమా దర్శకుడు కె.విశ్వనాథ్ మృతికి ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్ వద్ద రింగ్ సెంటర్లో ఆయనకు నివాళులర్పించారు. సీనియర్ జర్నలిస్ట్ అడపా వెంకట్రావు మాట్లాడుతూ విశ్వనాథ్ సినీ పరిశ్రమకు చేసిన సేవలను వివరించారు. సినీ పరిశ్రమ ఉన్నంతవరకు ఆయన చరిత్రలో గుర్తుండి పోతారన్నారు. మన దేశ సాంస్కృతి సాంప్రదాయాలను తన సినిమాల ద్వారా ప్రపంచానికి చాటి చెప్పిన మహా వ్యక్తి విశ్వనాథ్ అని కొనియాడారు. ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు, తోటకూర సాయి రామకష్ణ, బడుగు సీతారామరాజు, గిడుతూరి శ్రీనివాసరావు, జి.రాజు మాస్టారు, న్యాయవాది కొర్లమండ వీరభద్రరావు పాల్గొన్నారు.

రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యం

పట్టు పరిశ్రమ అధికారి రాజు





ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

మల్బరీ తోటల పెంపకానికి పట్టు పరిశ్రమ ద్వారా రైతులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం రాయితీలు అందిస్తోందని పట్టు పరిశ్రమ జిల్లా అధికారి బుద్ధరాజు మోహన వెంకట రామరాజు అన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. పట్టు పరిశ్రమ ద్వారా రైతులకు అందిస్తున్న రాయితీలు, ఇన్‌పుట్ సబ్సిడీలు తదితర అంశాలను ఆయన ప్రజాశక్తికిచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

జిల్లాలో ఎంత సాగు ఎక్కడెక్కడ జరుగుతుంది.?

జిల్లాలో మెట్ట మండలాలైన గొల్లప్రోలు, తుని, కోటనందూరు, శంఖవరం, రౌతులపూడి, తొండంగి, రంగంపేట, పెద్దాపురం, పిఠాపురం, బిక్కవోలు మండలాల్లో మల్బరీ తోటల సాగు జరుగుతోంది. దాదాపు 2,500 ఎకరాల్లో సుమారు 1015 మంది రైతులు వీటిని సాగు చేస్తున్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో కకూన్ మార్కెట్ ఉంది. ప్రతి నెలా ఆదాయం వచ్చే సాగు కాబట్టి రైతులు మరింతగా అవగాహన పెంచుకోవాలి.

ప్రభుత్వం ఏయే పథకాలను అమలు చేస్తోంది.?

పట్టు పురుగుల పెంపకం, పట్టు పురుగుల షెడ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం విరివిగా రాయితీలు ఇస్తోంది. ఎకరం యూనిట్ విలువ రూ.25 వేలు కాగా 75 శాతం సబ్సిడీ అంటే రూ.18,750 వేలు రాయితీ ఇస్తోంది. ఎస్సీలకు 90 శాతం వరకూ రాయితీ లభిస్తోంది. పట్టు పురుగుల షెడ్ నిర్మాణానికి ప్రభుత్వం ఒక్కో రైతుకి రూ.4 లక్షలు ఆర్థిక సహాయం చేస్తోంది. ఎస్సి రైతులకు 90 శాతం, ఇతరులకు 75 శాతం రాయితీ వస్తోంది. పట్టు పరిశ్రమకు అవసరమైన సబ్సిడీ ప్రభుత్వం ఇస్తోంది. ఇందులో సైతం ఎస్‌సి రైతులకు 90 శాతం, ఇతరులకు 75 శాతం రాయితీ వస్తుంది. ఇన్‌పుట్ రాయితీల్లో భాగంగా పట్టు గూళ్లకు 50 శాతం రాయితీ లభిస్తోంది. తెల్ల గూళ్లకు కిలోకి రూ.50 ప్రభుత్వం చెల్లిస్తోంది. ఎన్ని కిలోలకైనా ఇన్‌సెంటివ్ లభిస్తుంది.

'ఉపాధి' హామీ నిధులతో ప్రయోజనాలు ఏమైనా ఉన్నాయా.?

పట్టు పరిశ్రమను మరింత ప్రోత్సహించేందుకు వీలుగా ప్రభుత్వం ఉపాధి హామీ నిధులు కేటాయిస్తోంది. తద్వారా జిల్లాలోని రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతోంది. గరిష్టంగా 2 ఎకరాల్లో ఎకరాకు ఉపాధి హామీ పథకం ద్వారా రూ.63 వేలు, ఇందులో పట్టు పరిశ్రమ ద్వారా సబ్సిడీ రూ.18,750 వస్తోంది. గరిష్టంగా 5 ఎకరాల వరకూ ఇస్తాము. ఉపాధి హామీ పథకంలో మల్బరీ తోటలు పెంపకంలో భాగంగా సబ్సిడీలను అందిస్తోంది. 2 ఎకరాలు ఉన్న రైతుకు ఈ మొత్తాన్ని మూడేళ్ల పాటు ఇస్తారు. సన్న, చిన్నకారు రైతులకు మాత్రమే ఈ రాయితీ ఇస్తున్నారు.

షెడ్ల నిర్మాణానికి ఎటువంటి సహాయం అందుతుందో తెలియజేయండి.?

టైప్1లో నిర్మించనున్న రెయిలింగ్ షెడ్లకు 75 శాతం సబ్సిడీ అంటే రూ.3 లక్షలు ఇస్తున్నారు. టైప్ 2లో రూ.2.25 లక్షలు సబ్సిడీ వస్తుంది. ఉపాధి పథకం నుంచి రూ.3 లక్షలు వస్తుంది.

పట్టు ఉత్పత్తిలో జిల్లా ఎన్నో స్థానంలో ఉంది.?

పట్టు ఉత్పత్తిలో రాష్ట్రంలో అనంతపురం, చిత్తూరు జిల్లాల తర్వాత కాకినాడ జిల్లా మూడో స్థానంలో ఉంది. తెల్ల గూళ్ల ఉత్పత్తిలో రెండో స్థానంలో ఉన్నాం. ఫ్యాషన్ టెక్నాలజీ పెరుగుతున్న నేపథ్యంలో పట్టు వాడకానికి ప్రజలు ఎక్కువ మక్కువ చూపుతున్నారు. దేశంలో పట్టు ఉత్పత్తుల ఎగుమతుల ద్వారా విదేశీ మారకద్రవ్యం లభిస్తోంది. పట్టు ఉత్పత్తి, మార్కెటింగ్‌పై రైతులకు అవగాహన కలిగిస్తున్నాము.

మరిడమ్మను దర్శించుకున్న పిఠాపురం జడ్జి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారిని ఆదివారం పిఠాపురం జడ్జి కె.శ్రీదేవి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో వేద పండితులు హరి గోపాల శర్మ, వెంకట శాస్త్రి, ఐవి ప్రకాష్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు.


రాళ్ల లోడుతో వెళుతున్న లారీలు

ప్రమాదకరంగా లోడు లారీలు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి


అమీనాబాద్‌లో హార్బర్ నిర్మాణానికి రాళ్ల తరలిస్తున్న లారీలు ప్రమాదకరంగా ప్రయాణిస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. హార్బర్‌కు ఇటీవల భారీ నుంచి అతి భారీ స్థాయిలో లారీలపై పెద్ద పెద్ద రాళ్లు తీసుకువెళుతున్నారు. హార్బర్ నిర్మాణ సమీపంలో సముద్రాన్ని నింపేందుకు ఈ రాళ్లు కొన్ని రోజులుగా తీసుకెళుతున్నారు. పరిమితికి మించి సుమారు 60 టన్నుల పైబడి తీసుకువెళుతున్నారు. రోడ్లన్నీ ఎక్కడికక్కడ పాడైపోవడంతో లారీ నుంచి రాళ్లు కింద జారితే ప్రాణాలు గాల్లోకి పోతాయని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


అగ్ని ప్రమాద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ

అగ్నికి ఆహుతైన మహా వృక్షం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలం దివిలి గ్రామ ప్రధాన రహదారిలో శనివారం రాత్రి చెట్టు తొర్రలో నిప్పు రాజుకుని మంటలు చెట్టుకొమ్మలకు వ్యాపించాయి. ఈ వార్త తెలిసిన వెంటనే పెద్దాపురం అగ్నిమాపక సిబ్బంది చెట్టును పూర్తిగా ఆర్పేందుకు,ఈ మంటలు సమీపంలోని ఇళ్లపైకి విస్తరించకుండా గంటల తరబడి కష్టి చేసి మంటలను ఆర్పి వేశారు.ఆదివారం మధ్యాహ్నం కాలిపోయిన మహా వక్షం నేలమట్టమయింది. ఈ నిద్ర గన్నేరు చెట్టుకు వంద సంవత్సరాల పైగా వయసు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఆదివారం ఈ వక్షం దగ్గమైన ప్రాంతాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన చెట్టు తొర్రలు డొల్లలు గా మారి ప్రమాదంగా పరిణమించిన చెట్లను గుర్తించి వాటి వల్ల ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని రోడ్లు భవనాల శాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కొత్తెం వెంకట శ్రీనివాసరావు(కోటి) పాల్గొన్నారు.


వైసిపిలో చేరిన వారితో ఎంఎల్ఎ పర్వత

200 మంది వైసిపిలో చేరిక

ప్రజాశక్తి -రౌతులపూడి

మండలంలోని గిడజాం గ్రామానికి చెందిన బీర రామ్మోహన్ ఆధ్వర్యంలో 200 మంది కార్యకర్తలు ప్రతిపాడు ఎంఎల్ఎ పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ సమక్షంలో ఆదివారం వైసిపిలో చేరారు. వైసిపి కండువాలు వేసి ఎంఎల్ఎ వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ పర్వత మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు శ్రీను, వైస్ ఎంపిపి సూర్రెడ్డి తిరుమల రాయలు, స్థానిక నేతలు అగ్ని వెంకటరమణ తదితరులు ఉన్నారు.

సముద్ర తీరంలో పోటెత్తిన జనం

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

ఉప్పాడ సముద్ర తీరంలో పిఠాపురం కుంతీ మాధవ స్వామికి ఆదివారం చక్రస్నానం నిర్వహించారు. అనంతరం సముద్రంలో స్నానాలు ఆచరించేందుకు తీరానికి భారీగా జనం చేరుకున్నారు. ఆదివారం వేకువ జామునే కుంతీ మాధవ స్వామిని ఊరేగింపుగా కొండేవరం, వాకతిప్ప, కొత్తపల్లి మీదగా ఉప్పాడ సముద్రతీరానికి తీసుకువచ్చారు. కొత్తపల్లి ఎస్ఐ రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు..

అన్నదానానికి రూ.10,116 విరాళం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో శ్రీ శృంగార వల్లభ స్వామి ఆలయంలో అన్నదానం నిమిత్తం ఆదివారం పిఠాపురం పట్టణానికి చెందిన ఊటా రాము రూ.10,116 విరాళంగా ఆలయ ఇఒ పులి నారాయణమూర్తికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ప్రజా ప్రతినిధులు,స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.



విగ్రహం తొలగిస్తున్న సిబ్బంది

ఏలేశ్వరంలో వైఎస్ఆర్ విగ్రహం తొలగింపు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో ప్రధాన దారులు విస్తరణ, డ్రైనేజీలు నిర్మాణం నిమిత్తం ఆక్రమణల తొలగింపులో భాగంగా అధికారులు బాలాజీ చౌక్ సెంటర్‌లోని వైయస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని తొలగించారు. శనివారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ సమక్షంలో ఆక్రమణదారుల సమావేశం నిర్వహించిన అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు సమావేశం నిర్వహించారు. ఆక్రమణల తొలగింపులో ప్రజల నుండి వ్యతిరేకత రాకుండా ఉండేందుకు, ఆక్రమణల తొలగింపులో ఎవరికి మినహాయింపు లేదని సంకేతాలు ఇచ్చేందుకే వైఎస్ విగ్రహాన్ని సైతం తొలగిస్తున్నారని పలువురు భావిస్తున్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

125 మందికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె. గంగవరం మండలంలోని శివల గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం లో125 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు.వైద్య శిబిరాన్ని వైసిపి నాయకులు ఇళ్ళ సూర్యనారాయణ ప్రారంభించారు. గ్రామం లోని అరుణా క్లినిక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్య క్రమం లో శలా దుర్గా ప్రసాద్. సత్య నారాయణ, తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు. శివల, యర్రపోతవరం గ్రామాల నుంచి ప్రజలు హాజరయ్యారు.


సమావేశంలో ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

'మొబైల్ షాప్' కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణం లోని మొబైల్ షాప్ యూనియన్ నూతన కార్య వర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. గౌరవ అధ్యక్షులు కంచుమర్తి బాబురావు సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మొబైల్ షాప్ ఓనర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా గంగరాజు వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ గా మేడపాటి భార్గవ్ రెడ్డి , సెక్రటరీగా పెరుమాళ్ల శ్రీ రాజా. జాయింట్ సెక్రెటరీ ద్వారంపూడి వెంకటరెడ్డి, ట్రెజరర్ తేలు సూర్య నాగేశ్వరరావు, సభ్యులు కర్రి నాగరాజు,పెదపాటి త్రినాథ్, కల్లూరి భాస్కరరావు, పసల సురేష్, పోతబత్తుల రాము, మేడిశెట్టి వెంకట దుర్గాప్రసాద్, ముఖ్య సలహాదారులుగా రాయుడు దేవి ప్రసాద్, మన్ని వీరభద్ర రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని చాంబర్ ఆఫ్ కామర్స్ పట్టణ ప్రముఖులు అభినందించారు.

వైద్యం అందక రోగుల ఇబ్బందులు

ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సెలవు?
నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-మండపేట

పట్టణ ప్రజలకు వైద్యం మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యం సదుపాయాలు అందకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది సమయపాలన పాటించకపోవడం, రోగులకు వైద్యసేవలందించడం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం తదితర కారణాల నేపథ్యంలో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలేదు.మండపేట పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం చెంతనే ఒకటి, స్థానిక గొల్లపుంత కాలనీలోని టిడ్కో ఇళ్ల సముదాయంలో మరొకటి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. దళితపేటలోని ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్ట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఎల్‌జియస్ ఉన్నారు. ఈ ఆసుపత్రికి సుమారుగా నెలకు 70 నుంచి 100 మంది బిపి, 80 నుంచి 100 మంది షుగర్ వ్యాధిగ్రస్తులు వస్తుంటారు. వీరికి హెచ్‌బి, షుగర్, తదితర 8 రకాల పరీక్షలు నిర్వహించి మందులు అందజేయాల్సి ఉంటుంది. ఈ కేంద్రాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యసేవలు అందించాల్సి ఉండగా ఇక్కడి పనిచేసే సిబ్బంది దూర ప్రాంతాల నుంచి వస్తుండటంతో సమయపాలన పాటించడంలేదని పలువురు చెబుతున్నారు. మిగిలిన రోజుల్లో ఎలా ఉన్నా సెలవు, ఆదివారాల్లో కేంద్రానికి మధ్యాహ్నానికే తాళం వేస్తున్నారని రోగులు చెబుతున్నారు. ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో కేంద్రాన్ని తెరచి తిరిగి 11 గంటలకే తాళం వేసినట్లు ప్రజలు చెబుతున్నారు. ఇంటి దగ్గరలోనే ఆసుపత్రి ఉన్న వైద్య సేవలు పొందేందుకు సుమారు కిలో మీటరు దూరంలో ఉన్న ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి వెళ్ళాల్సి వస్తుందని స్థానిక ప్రజలు ఆవేదన చెందుతున్నారు.



వైద్యం వచ్చిన ప్రజలు, (ఇన్‌సెట్)లో తాళం వేసిన దళితపేటలో పట్టణ పిహెచ్‌సి

పట్టించుకోని ఉన్నతాధికారులు

సిబ్బంది సమయపాలన పాటించడంలేదని తెలిసిన ఉన్నతాధికారులు పట్టి పట్టనట్లు వ్యవహరిస్తుండంతో వైద్యం సాయం అందడంలేదని రోగులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమయపాలనతో కూడిన వైద్యసేవలు అందించాలని వారు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఈ విషయంపై జిల్లా వైద్యాధికారి దుర్గారావుదొరను వివరణ కోరగా అక్కడ పనిచేసే వైద్యులు, సిబ్బందితో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎంఎల్‌ఎ జ్యోతుల

ప్రజాశక్తి -గోకవరం

మండలంలోని కృష్ణునిపాలెంలో సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మి, జోగేశ్వరావు దంపతుల ఆధ్వర్యంలో పోలవరం పునరావాస కాలనీలో రామాలయం గుడి వద్ద ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబు పాల్గొన్నారు. ఎంఎల్‌ఎ చంటిబాబు మాట్లాడుతూ పోలవరం పునరావాస కాలనీలో ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి సుబ్బారావు, ఎంపిపి తోట రవి, బండారు రాజా, కందుల బాబ్జి, గోకవరం మండల సచివాలయంల కన్వీనర్ దాసరి రమేష్, వైసిపి మండల కన్వీనర్ పాటి రాంబాబు వైసిపి నాయకులు సుంకర వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి - చాగల్లు

చంద్రవరం శాఖ గ్రంథాలయంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన పుస్తకాల ప్రదర్శన ఆకట్టుకుంది. బాల సాహిత్యం పుస్తకాలను పుస్తక ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. బొమ్మలతో కూడిన రామాయణం, భారతం, బొమ్మరిల్లు కథలు, అక్బర్ బీర్బల్ కథలు, ఆలీబాబా 40 దొంగలు, భాగవత కథలు, తెనాలి రామకృష్ణ కథలు, అరేబియన్ నైట్స్, పిల్లల హాస్య కథలు వంటి పుస్తకాలను ప్రదర్శనలో ఉంచారు. నెలలో మొదటి ఆదివారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామని లైబ్రేరియన్ కె.సుమన్‌కుమార్ తెలిపారు. అలాగే ప్రతి ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథ మహిళ పేర అన్నదానం

మానవత్వం చాటుకున్న ఎస్ఐ రామారావు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

అనాథ మహిళ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించడమే కాకుండా, ఆమె పేరుతో అన్నదానం నిర్వహించి మానవత్వం చాటుకున్నారు ఉండ్రాజవరం ఎస్ఐ కె.రామారావు. మార్కెట్ రహదారిలో నివాసం ఉండే తాతబత్తుల గాయత్రి(80) జనవరి 25న మతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న వార్డు మెంబర్ కల్పన, ఆమె భర్త కష్ణ, మాచినేని మధు, పిప్పర్ల వరప్రసాద్ స్థానిక ఎస్ఐకు తెలియజేశారు. స్పందించిన ఎస్ఐ ఆమెకు అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె పేరుతో ఆదివారం 100 మంది పేదలకు అన్నదానం నిర్వహించారు. స్థానికులు, గ్రామస్తులు రామారావును అభినందించారు.

ఎవరికి కష్టం వచ్చినా స్పందిస్తాం...

రాంబాబు కుటుంబానికి రూ.5 లక్షల సాయం

వైసిపి యువజన విభాగం నేత జక్కంపూడి గణేష్

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం నియోజకవర్గంలో ఏ కుటుంబానికి కష్టమొచ్చినా ముందుగా స్పందించేది, సాయం అందించేది జక్కంపూడి కుటుంబమేనని వైసిపి యువజన విభాగం నాయకుడు జక్కంపూడి గణేష్ అన్నారు. కోరుకొండ మండలం కోటికేశవరంవద్ద కాలువ తవ్వకం పనుల్లో మట్టి పెళ్లలు మీదపడి మతిచెందిన రాంబాబు కుటుంబానికి రూ.5లక్షల చెక్కును గణేష్ ఆదివారం అందించారు. రాంబాబు తల్లికి ప్రత్యేకంగా మరో రూ.లక్ష చెక్కు అందించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ జరిగిన ఘటన దురదృష్టకరమన్నారు. రాంబాబు లేని లోటు ఆ కుటుంబానికి తీరనిదన్నారు. సంఘటన తెలిసిన వెంటనే సంబంధిత శాఖ అధికారులు, కాంట్రాక్టరుతో సంప్రదించామని, రాంబాబు కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందిస్తున్నామన్నారు. రాంబాబు ఇద్దరు పిల్లల చదువుకు సంబంధించి పూర్తి సహకారం అందిస్తామన్నారు. భవిష్యత్తులో రాంబాబు కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని ప్రకటించారు.


చెక్కును అందిస్తున్న గణేష్

లోకేష్ యాత్రతో వైసిపికి ఓటమి భయం

ప్రజాశక్తి-రావులపాలెం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పేరుతో చేపట్టిన పాదయాత్రకు వస్తున్న ప్రజాదరణ చూసిన వైసిపి నేతలకు ఓటమి భయం పట్టుకుందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, కొత్తపేట మాజీ ఎమ్ఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. ఊబలంక గ్రామంలో జరిగిన పార్టీ బూత్ కన్వీనర్లు, క్లస్టర్ ఇంచార్జిలు, గ్రామ పార్టీ నాయకులు సమావేశానికి సత్యానందరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. లోకేష్ పాదయాత్రను అడ్డుకుని పార్టీ కార్యకర్తలపై దాడులు చేసిన వారిపై కాకుండా టిడిపి కార్యకర్తల పైన హత్యాయత్నం కేసులు పెట్టడం, నిబంధనల పేరుతో లోకేష్, మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి, పులవర్తి నాని, ఎమ్ఎల్‌సి దీపక్ రెడ్డిపై కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు గుత్తుల పట్టాభిరామారావు, బూత్ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, గ్రామ టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లులో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మట్టా సుబ్బారావు ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో అభియాన్ గోడ పత్రిక, చేయి చేయి కలుపుదాం రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుచుదాం పేర ముద్రించిన కరపత్రికలతో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రతి గడపకూ తీసుకెళ్లాలన్నారు. జిల్లా కార్యదర్శి జనుకూటి రవికుమార్, కాంగ్రెస్ కొవ్వూరు మండల అధ్యక్షులు సాకే పుల్లారావు, చాగల్లు మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు జి.భాస్కరరావు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా జాతరలు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల అమ్మవార్ల జాతరలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివరాలు ఇవి.. **ఆలమూరు** స్థానిక కండ్రిగ పేటలో యానాదుల సంఘం ఆధ్వర్యంలో యాత్రికుల సాయంతో సత్తెమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో అమ్మవారి, పోతురాజు, వినాయకుని నూతన విగ్రహల పున:పతిష్ట ఆదివారం ఘనంగా నిర్వహించారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు సత్యానందరావు, పారిశ్రామికవేత్త శ్రీ మురళికష్ణ సంస్థల అధినేత వంటిపల్లి పాపారావు తదితరులు పాల్గొన్నారు. దాత ఈదల సత్యనారాయణ మూర్తి దంపతులు రూ. 50 వేలతో నూతన విగ్రహాలు సమకూర్చగా, ప్రతిష్ట నిమిత్తం అయ్యే ఖర్చులకు దాత వంటిపల్లి పాపారావు దంపతులు రూ. 50 వేలు విరాళాన్ని అందజేశారు. **మండపేట** స్థానిక 30వ వార్డు గొల్లపుంత కాలనీలోని వరాల సత్తెమ్మ తల్లి 8వ జాతర వార్షిక మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, ఛైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అమ్మవారిని దర్శించుకున్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంఎల్‌సి తదితరులు

విద్యాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-మండపేట

విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని సర్పంచ్ గారపాటి సౌజన్య అన్నారు. ఆదివారం మెర్నిపాడులో ఎంపిపి పాఠశాల భవన నిర్మాణ పనులకు సర్పంచ్ సౌజన్య శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు అందించడంలో భాగంగా ప్రభుత్వం కార్పొరేట్ స్కూలుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను అభివద్ధి చేస్తోందన్నారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పాఠశాల భవనం నిర్మాణంతో పాటు కిచెన్ షెడ్లు, టాయిలెట్స్ చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎనమదుల వెంకటలక్ష్మి, ముత్యాల పెద్దబ్బు, పంపన బుల్లియ్య, చల్లా మోహన్, గారపాటి ఎర్రబ్బు, గారపాటి రాంబాబు, పంచాయతీ కార్యదర్శి వర్మ, సచివాలయ సిబ్బంది జి.రాజు, విద్య కమిటీ చైర్మన్ కప్పల రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ సౌజన్య

దస్తావేజు పడిపోయినది

పి.గన్నవరం మండలం, నరేంద్రపురం గ్రామ కాపురస్తులు **శిష్టా లక్ష్మీనరసింహమూర్తి, తండ్రి: కృష్ణ** మూర్తి ది.01-02-2023వ తేదీన నరేంద్రపురం నుండి ఎస్.ఆర్.ఓ. ఆఫీసు అంబాజీపేట వెళ్ళుచుండగా మార్గ మధ్యలో నాయొక్క దస్తావేజు పడిపోయినది. సర్వే నెం. 397/2, పూరా య.1-13 సెంట్లులో 56.1/2 సెంట్లు దస్తావేజు పడిపోయినది. దస్తావేజు నెంబరు 2811/1945, తేదీ 24-10-1945 సంవత్సరంలోనిది. డాక్యుమెంటు విచారణ కొరకు పి.గన్నవరం పోలీస్టేషనులో రిపోర్టు పెట్టినాము.